ప్రజాశక్తి
మంగళవారం 17 జూన్ 2025 5
శ్రీ సత్యసాయి

తహశీల్దార్ కార్యాలయం ముందు

వృద్ధురాలి వినూత్న నిరసన

కార్యాలయం ముందు వంటచేసిన బాధితురాలు
తన ఇంటి స్థలానికి హద్దులు చూపాలని వేడుకోలు

తహశీల్దార్ కార్యాలయం ముందు వృద్ధురాలి వంటావార్పు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని కొండాపురం పంచాయతీ రాగి మేకల పల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వినూత్న నిరసన వ్యక్తం చేసింది. తన సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవటంతో కార్యాలయం ముందే వంట చేసి నిరసన వ్యక్తం చేసింది. దీంతో అధికారులు దిగొచ్చారు. మంగళవారం గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తామని వృద్ధురాలికి తహశీల్దార్ మారుతి హామీతో కూడిన నోటీసును అందజేశారు. ఈ ఘటనకు సంబందించిన వివరాలు..

మండలంలోని కొండాపురం పంచాయతీ రాగిమేకలపల్లి గ్రామానికి వడ్డే వెంకటలక్ష్మమ్మ అనే వృద్ధురాలు నివసిస్తోంది. ఆమెకు సర్వే నెంబర్ 150 –3లో ఇంటి పట్టా ఉంది. ఈ స్థలానికి సంబంధించి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించింది. అయితే అధికారులు ఎవరూ స్పందించలేదు. నెలరోజులుగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతోంది. అధికారులెవరూ స్పందించకపోవటంతో విసుగుచెందిన వెంకటలక్ష్మమ్మ సోమవారం నిరసనను దిగింది. తనతో పాటు తెచ్చుకున్న వంటపాత్రలతో తహశీల్దార్ కార్యాలయం ముందు పొయ్యి ఏర్పాటు చేసి వంట వండుతూ నిరసన తెలిపింది. దెబ్బకు అధికారులు దిగొచ్చారు. మంగళవారం గ్రామానికి వచ్చి ఇంటిస్థలం కొలిచి హద్దులు చూపిస్తామని తహశీల్దార్ మారుతి బాధితురాలికి హామీతో కూడిన నోటీసును అందజేశారు.

వలస కార్మికుల వెతలు

దుర్భర జీవితం గడుపుతున్న కార్మికులు
అమలుకు నోచని వలస కార్మిక చట్టం
మామూళ్ల మత్తులో కార్మిక శాఖ

వలస కార్మికులు నివాసం ఉండే ప్రాంతం

ఉన్నచోట ఉపాధి లేక పొట్ట కూటి కోసం కడుపు చేత పట్టుకుని పని కోసం వేల కిలోమీటర్లు వచ్చిన వలస కార్మికుల బాధలు, కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక శాఖ వారిని మరింత కష్టాల్లోకి నెట్టింది. రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులను కన్నీళ్ల పాలు చేస్తోంది. వలస కార్మిక చట్టాన్ని (మైగ్రేషన్ యాక్టు) కార్మిక శాఖ మామూళ్ల కోసం యాజమాన్యాలకు తాకట్టు పెట్టింది. దీంతో హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం పారిశ్రామికవాడల్లో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం రూరల్ మండలంలోని తూమకుంట, గోళాపురం పారిశ్రామికవాడలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రాంతంలో సండ్లపల్లి, తూముకుంట, గోళాపురం, కొట్నూరు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 150కి పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా ఫార్మ, స్టీల్ పరిశ్రమల్లో ఒరిస్సా, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వలస కార్మికులు పని చేస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం కార్మిక శాఖ అధికారులు వలస కార్మిక చట్టాన్ని అనుసరించి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలన్నింటినీ సేకరించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో వలస కార్మిక చట్టం అమలు జరగడం లేదన్నది అక్షర సత్యం. వలస కార్మికులు ఎంతమంది ఏ పరిశ్రమలో పని చేస్తున్నారు, వాళ్ళు ఎక్కడ నివాసముంటున్నారు, వారికి వేతనం ఎంత ఇస్తున్నారు అన్న వివరాలు సైతం కార్మిక శాఖ వద్ద లేకపోవడం గమనార్హం. కార్మిక గుత్తేదారు నుంచి కార్మికులను దిగుమతి చేసుకొని ఆ కార్మికులకు కనీస సౌకర్యాలు సైతం కల్పించకుండా ఒకే గదిలో 5 నుంచి 10 మందిని ఉంచి వారి శ్రమను గుత్తేదారులు, పారిశ్రామిక వేత్తలు దోచుకుంటున్నారు. నిబంధనల మేరకు ఎనిమిది గంటల పనివిధానం ఉంటే ఇక్కడ 12 గంటలు పనిచేస్తున్నారు. వీరికి వేతనాలు సైతం సరిగా ఇవ్వటం లేదు. విధులు నిర్వహిస్తే వేతనం లేదంటే లేదు. ఒక్క రోజు విధులకు హాజరు కాక పోయిన ఆ రోజు వేతనంలో కోత విధిస్తారు. కనీసం వీరు నివాసం ఉండడానికి అయిన మంచి గదులు కేటాయిస్తారా అంటే అదీ లేదు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు కేటాయించిన చిన్న గదుల్లో పదుల సంఖ్యలో వలస కార్మికులు బిక్కుబిక్కుమంటూ జీవనం చేయాల్సిన పరిస్థితి ఉంది. కనీసం స్నానం చేయడానికి స్నానపు గదులు సైతం లేవు. అరుబయట స్నానం చేయాల్సిన పరిస్థితి. మరి కొన్ని పరిశ్రమల వారు పరిశ్రమల లోపలే గదులను ఏర్పాటు చేసి వారిని ఖైదీల కంటే హీనంగా చూస్తున్నారు. ఇది చాలదన్నట్లు స్టీల్ పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించి గాయపడిడే వారిని పట్టణానికి తీసుకు రాకుండా పక్కన ఉన్నా కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరుకు తీసుకెళుతున్నారు. ప్రమాదాల్లో ఎవరైనా కార్మికులు మృతి చెందితే గుట్టు చప్పుడు కాకుండా బాధిత కుటుంబానికి అరకొర నష్ట పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఈ ప్రాంతంలో వలస కార్మికులు ఇంత దుర్భరంగా జీవిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ మాత్రం నిద్ర మత్తులో నుంచి బయటకు రావడం లేదు. జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ ఉన్న హిందూపురంలో జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాల్సి ఉన్నప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఈ శాఖ జిల్లా అధికారి జిల్లా కేంద్రానికే పరిమితం అయ్యారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎప్పటికప్పుడు పరిశ్రమలపై తనఖీలు నిర్వంహించి, వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, వలస కార్మికుల వివరాలను సేకరించి, వారికి కార్మిక చట్టం ప్రకారం అందాల్సిన సౌకర్యాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఉంది.అయితే కార్మిక శాఖ అధికారులు ఎవరు రాక పోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయి. వీరు పడుతున్న భాదలను ఎవరికి చెప్పాలో తెలియక, బయటకు చెబితే యాజమాన్యాలు ఉద్యోగంలో నుంచి తీసి వేస్తాయన్న భయంతో కనీస సౌకర్యాలు లేక పోయిన అక్కడే జీవనం చేస్తున్నారు.

నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి

తూమకుంట, గోళపురం పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్, ఫార్మా, వీర్గో పరిశ్రమలో పని చేస్తున్న వలస కార్మికుల నివాస ప్రాంతాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వారి నివాస స్థలాలలో పారిశుధ్యాన్నిమెరుగు పరచాల్సిన అవసరం ఉంది. ప్రతి నెల ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి.

రవికుమార్
తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక యూనియన్ అధ్యక్షులు

వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి

తూముకుంట,గోళాపురం పారిశ్రామికవాడలో కార్మిక శాఖ వెంటనే వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, కార్మికుల వివరాలను సేకరించాలి. వారికి కార్మిక శాఖ నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో వలస కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

ఈ ఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

తమ సమస్యలు చెబుతున్న వలస కార్మికులు

ఆరుబయట స్నానం చేస్తున్న వలస కార్మికుడు

యోగాసనాలు వేస్తున్న మంత్రి , జిల్లా కలెక్టర్, కియా ప్రతినిధి

యోగాతో మానసిక ప్రశాంతత

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖమంత్రి సవిత అన్నారు.సోమవారం పెనుకొండ మండలం యర్రమంచి వద్ద ఉన్న కియా పరిశ్రమ ప్రాంగణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కియా సిఎఒ కబ్ డాంగ్ లీ, పెనుకొండ ఆర్‌డిఒ ఆనంద్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ భాస్కర్, వివిధ జిల్లా ప్రభుత్వ శాఖ అధికారులు, పెనుకొండ మండలం అధికారులు , పలువురు పెనుకొండ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కియా ఉద్యోగ సిబ్బంది, విద్యార్థులు, బ్రహ్మకుమారి ఈశ్వరీ కార్యకర్తలు, స్వయం సహాయక మహిళా బందాలు, ఆశా , ఐసిడిఎస్ వర్కర్లు తదితరులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగావల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రజలు దీనిపై అవగాహన చేసుకొని ఆరోగ్య సంరక్షణ పొందాలని సూచించారు. ఈనెల 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారని తెలిపారు. ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఇన్‌ఛార్జి డీఎస్పీ మహేష్, తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో నరేష్, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, కియా ప్రిన్సిపల్ అడ్వైజర్ సోమశేఖర్ రెడ్డి, యోగ శిక్షకులు నారాయణరెడ్డి, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ ప్రతిపాదనను విరమించుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

విలేకరులతో మాట్లాడుతున్న ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రేషన్ సరుకులకు బదులు నగదు బదిలీ చేస్తామన్న ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక హమాలీలతో కలసి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రేషన్ సరుకులకు బదులు బదిలీ పథకం అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు, పేదలు, డీలర్లు వేలాదిమంది వీధిన పడతారన్నారు. నగదు బదిలీలతో ప్రజలకు ఏమాత్రం ఉపయోగం ఉండదన్నారు. కోట్లాదిమంది జీవితాలను కష్టాలు పాలు చేసే నగదు బదిలీ పథకం ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. స్టాక్ పాయింట్లలో 12 రోజులు ఉండాల్సిన మూమెంట్ కాల పరిమితిని మూడు లేదా ఐదు రోజులకు కుదించడం వల్ల హమాలీలు మానసికంగా ఆరోగ్యపరంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. గత కూలి రేట్ల ఒప్పందం తర్వాత మధ్యాహ్న భోజనం పథకం 25 కిలోలు సోనా మసూరి బియ్యాన్ని సంచులలో నింపడం, కాటా వేసి కుట్టడం, ట్యాగులు వేయడం వంటి పనులు హమాలీలకు అదనపు భారం అవుతుందన్నారు. అదనపు పనికి అదనపు కూలి 12 రూపాయలు చెల్లించాలన్నారు. స్టాక్ పాయింట్లలో హమాలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ నాయకులు నాగరాజు, రామదాసు, సుబ్రహ్మణ్యం, రామంజి, మోదీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి :

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపల్ కార్మికులకు ఇంజనీరింగ్ కార్మికులకు పుడాలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ లో కార్మికులతో కలసి కలెక్టర్ టిఎస్ చేతన్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిఐటియు పట్టణ కన్వీనర్ పైపల్లె గంగాధర్, ఆటో యూనియన్ కార్యదర్శి పెడపల్లి బాబా మాట్లాడుతూ తక్కువ వేతనాలతో ఎక్కువ పని గంటలు పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలేదన్నారు. కనీస వేతన చట్టం కూడా అమలు చేయలేదన్నారు.కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయకుండా సంక్షేమ పథకాలు వర్తింప చేయకుండా కార్మికులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను గుర్తించి వారికి పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ నాయకులు నాగార్జున, రామయ్య, గోవిందు, వెంకటేశు, లక్ష్మమ్మ, సాయమ్మ, నారాయణ, నరసింహులు, సరోజమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ 242 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, ఆర్డీవో సువర్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ ఎల్ ఏ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. పుట్టపర్తి డివిజన్ నుంచి 87, పెనుకొండ 66, ధర్మవరం 51, కదిరి డివిజన్ నుంచి 38 వినతులు రాగా వాటిని ఆయా డివిజన్ అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ప్రణాళిక

పుట్టపర్తి అర్బన్ : గిరిజనుల అభివృద్ధి కోసం భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ 'దర్తీ అభ జన జాతీయ గ్రామ్ ఉత్కష్ అభియాన్' పథకం ద్వారా పలు చర్యలు చేపడుతోందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆ పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 3 మండలాలకు సంబంధించిన 3 గ్రామాల్లో మౌలిక సదుపాయాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించి వాటిని కల్పించే ప్రక్రియను చేపడుతోందన్నారు. 17 శాఖల సమన్వయంతో 25 స్కీంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకూ ఎంపీడీవోలు సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తారని, అందులో ప్రజలు పాల్గొని ఆధార్, బ్యాంకు ఖాతా, హెల్త్ కార్డు, గ్యాస్ కనెక్షన్, జాబ్ కార్డు, విద్యుత్, కొళాయి కనెక్షన్, అటవీ భూ సమస్యలు, ఇంటి నిర్మాణము, తదితర సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

అన్ని వర్గాల ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం

'వెన్నుపోటు' పుస్తకావిష్కరణలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసగించి పాలన సాగిస్తోందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆపార్టీ రాష్ట్ర కమిటీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం (వెన్నుపోటు)' పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దీపిక, చౌళూరు మధుమతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సూపర్–6 హామీల వరాల జల్లు కురిపించి, ఏడాది గడిచిన వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజా ప్రతినిధులు, పట్టణ, మండల కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో నైపుణ్యతను పెంపొందించుకోవాలి

శిక్షణకేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

మహిళలు శిక్షణలో నైపుణ్యతను పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్,మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ధర్మపురంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ హిందూపురం మహిళలకు ప్రత్యేకంగా కుట్టు శిక్షణ ఇప్పించడంతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. పట్టణ వ్యాప్తంగా 10 కి పైగా కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 90 రోజుల పాటు ఇచ్చే ఉచిత శిక్షణలో 75శాతం హాజరు ఉంటే ఉచిత కుట్టు మిషన్ ను, ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశ్వర్థ నారాయణ, అంజి, షబ్బీర్, ఇర్షాద్ మెప్మా సిబ్బంది సీ.ఓ. లు, ఆర్పీలు మహిళలు పాల్గొన్నారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి

మున్సిపల్ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తన చాంబర్లో మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలల్లో పిల్లలను చేర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ పరంగా పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, సామ్రాజ్యం, చంద్రశేఖర్, పెన్నోబులం, రమణ, కృష్ణమోహన్, రోహిణి, విజయ్ కుమార్, ఎంటిఎఫ్ నాయకులు జనార్ధన్, రామాంజనేయులు, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘపరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జునను సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, గతంలో హిందూపురంలో 4 ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉండేవని, ఇటీవల మరో నాలుగు ఉన్నత పాఠశాలలగా ఉన్నతీకరించడంతో మొత్తంగా ఎనిమిది ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు.కొత్తగా ఏర్పడ్డ ఉన్నత పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తరగతులు నిర్వహించాల్సి ఉంటుందని, దీని కారణంగా భవనాల కొరత వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, సామ్రాజ్యం, చంద్రశేఖర్, పెన్నోబులం, రమణ, కృష్ణమోహన్, రోహిణి, విజయ్ కుమార్, ఎంటిఎఫ్ నాయకులు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే డంపింగ్ యార్డ్ తరలింపు :మంత్రి

సోమందేపల్లిలో వసతిగృహం విద్యార్థినులతో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

త్వరలోనే డంపింగ్ యార్డ్‌ను స్థానిక మడకశిర రోడ్డులోని రాజేశ్వరి కాలనీ సమీపంలోకి తరలిస్తామని మంత్రి సవిత తెలిపారు. మంత్రి సోమవారం పట్టణ పరిధిలో కొండ రోడ్డు పక్కన ఉన్న డంపింగ్ యార్డ్‌లో రీసైక్లింగ్ చేసే యంత్రాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చెత్త మీద పన్ను వేసిన పాలకుడు జగన్ అయితే చెత్తతో సంపద సృష్టించి పన్నును రద్దు చేసిన ప్రజా సేవకుడు సిఎం చంద్రబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల నుంచి రోజూ సేకరించిన చెత్తను 'రీ సైక్లింగ్'కి చేసి ఎరువులుగా మార్చి సంపద సృష్టించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడ తయారైన ఎరువులను రైతులు, నర్సరీలకు సరఫరా చేస్తామన్నారు. రైతులకూ అందుబాటు ధరలకే విక్రయిస్తామని తెలిపారు. త్వరలోనే డంపింగ్ యార్డ్‌ను రాజేశ్వరి కాలనీ సమీపంలోకి మారుస్తామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని చిల్డ్రన్స్ పార్కుగా అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామన్నారు. మంత్రి వెంట నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్, రాష్ట్ర యాదవ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, నాయకులు ఉన్నారు.

బాలికల విద్యకు పెద్దపీట : మంత్రి

సోమందేపల్లి : కూటమి ప్రభుత్వం బాలికల విద్య, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మంత్రి సవిత తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 1.94 కోట్ల వ్యయంతో నిర్మించిన టైప్ ఫోర్ బాలికల వసతి గృహం, రూ. 35 లక్షలతో నిర్మించిన ప్రహరీలను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రవాణా సౌకర్యం లేక సుదూర ప్రాంతాల విద్యార్థినులు చదువులు ఆపేసే పరిస్థితులు ఇక రావన్నారు. పాఠశాల ఆవరణలోనే బాలికలకు అన్ని సౌకర్యాలతో వసతి గృహం ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల నగదు జమ అవ్వని తల్లులు సచివాలయం వెళ్లి సరి చేసుకుంటే అర్హులందరికీ తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంఇఒ ఆంజనేయనాయక్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతి, టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి.ఆంజనేయులు, నాయకులు సిద్దలింగప్ప, నీరుగంటి చంద్ర, మాగే చెరువు సర్పంచి నరసింహులు, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి.హరి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోదాములు..!

చాలా చోట్ల పూర్తి కాని నిర్మాణాలు..
పూర్తయినవి ప్రారంభానికి నోచుకోని వైనం..
రైతులకు అందని సేవలు..

పెనుకొండ మండలం వెంకటగిరి పాలెం వద్ద నిర్మాణం పూర్తి అయిన గోదాము

ప్రజాశక్తి-పెనుకొండ

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించినప్పుడు విక్రయించుకునే వీలుగా ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి గోదాముల నిర్మాణం చేపట్టింది. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల అసంపూర్ణంగా నిలిచి పోయి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రైతులు అవస్థలు పడుతున్నారు.

నిర్మాణాలకు రూ. లక్షల వ్యయం

పెనుకొండ నియోజకవర్గంలోని పెనుకొండ, పరిగి, సోమందేపల్లి, రొద్దం, గోరంట్ల మండలాల్లో రూ. లక్షల వ్యయంతో రైతుల బహుళ ప్రయోజనాల సౌకర్యార్థం నిర్మించిన గోదా ములు నేడు నిరుపయోగంగా మారాయి. 1000 టన్నులు, 500 టన్నుల సామర్థ్యంతో గత ప్రభుత్వ హయాంలో గోదాముల నిర్మాణం చేపట్టారు. వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము నిర్మాణానికి రూ. 80 లక్షలు, 500 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము నిర్మాణానికి రూ. 40లక్షల మేర నిధులు కేటాయించారు. నియోజకవర్గానికి మొత్తం 16 మంజూరు కాగా అందులో పెనుకొండ-1, రొద్దం-1, గోరంట్ల-10, పరిగి-2, సోమందేపల్లి-2 గోదాములు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

అసంపూర్ణంగా గోదాముల నిర్మాణం..

గోదాముల నిర్మాణ పనులు చాలా చోట్ల ఆగిపోయాయి. పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాలెం వద్ద గోదాము నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు గోదామును వినియోగంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారు. పరిగి మండలంలోని పైడేటి, ఊటుకూరు, బసవనపల్లి సమీపంలో రెండు చోట్ల గోదాముల నిర్మాణ పనులు చేపట్టారు. పైడేటిలో గోదాము నిర్మాణం పూర్తయింది. బసవనపల్లిలో చేపట్టిన గోదాము నిర్మాణం టాప్ లెవెల్‌లో ఆగింది. పై కప్పుపై రేకులు అమర్చాల్సి ఉంది. నేటికీ పనుల్లో పురోగతి లేదు. పైడేటిలో పూర్తయిన గోదాము నిరుపయోగంగా దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. సోమందేపల్లి మండలంలోని నక్కలగుట్ట వద్ద చేపట్టిన గోదాము నిర్మాణం అసంపూర్ణంగా మిగిలిపోగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. మేకలపల్లిలో గోదాము నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉంది. గోరంట్ల మండలంలో 10 గోదాములు మంజూరయ్యాయి. బూదిలి, పాలసముద్రం, వానవోలు, గౌనివారిపల్లి, గోరంట్లలో ఒక్కోచోట రెండు గోదాముల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో 4 చోట్ల నిర్మాణాలు పూర్తి కాగా 7 చోట్ల అసంపూర్తిగా భవన నిర్మాణాలు ఆగిపోయాయి. రొద్దం మండలంలోని రాగిమేకలపల్లిలో చేపట్టిన భవన సముదాయం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు.

రైతులకు అందని సేవలు..

ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడం ప్రారంభమయ్యాయి. ముంగారు సేద్యానికి రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ప్రతి మండలంలో ప్రభుత్వ యంత్రాంగం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఈ ఏడాది అధిక దిగుబడి సాధించినా గిట్టుబాటు ధర వచ్చే వరకూ రైతులు నిల్వ ఉంచుకోవాలంటే గోదాములు వినియోగంలోకి రాలేదు. కొన్నిచోట్ల గోదాముల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్నిచోట్ల నిర్మాణాలు అసంపూర్ణంగా నిలిచిపోయాయి. దీంతో అన్నదాతలు పంటలను నిల్వ ఉంచుకోవడానికి అవస్థలు పడాల్సి ఉంటుంది.

రైతుల ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించాలి

నిర్మాణం పూర్తయిన గోదాములను ప్రభుత్వం తక్షణం ప్రారంభించాలి. అసంపూర్ణంగా నిలిచిపోయిన గోదాముల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించి వాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ పంటలను నిల్వ ఉంచుకునేందుకు గోదాములను అందుబాటులోకి తీసుకురావాలి.

- హరి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

బాధ్యతలు చేపట్టిన నూతన డిపిఆర్ఒ వేణుగోపాల్‌రెడ్డి

కలెక్టర్ చేతన్‌కు పూలబొకే ఇస్తున్న డిపిఆర్ఒ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా పి.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ముందుగా కలెక్టర్ టిఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చారు. ఇక్కడ డిపిఆర్ఒగా పనిచేసిన వేళాయధం బదిలీపై తిరుపతికి వెళ్లారు. కడప జిల్లాలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన డిపిఆర్ఒ మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందించేందుకు సహకరిస్తామన్నారు. అలాగే కడప కార్యాలయం నుంచి డివిజనల్ పిఆర్ఒగా పని చేస్తూ బదిలీపై వచ్చిన మస్తాన్ సాహెబ్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అధికారులకు డిపిఆర్ఒ కార్యాలయంలోని ఏఈఐ ఈ రామాంజనేయులు, సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

'తల్లికి వందనం' కష్టాలు

తహశీల్దార్ కార్యాలయంలో వేచి ఉన్న విద్యార్థుల తల్లులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యాప్తంగా సుమారు 6,564 మంది విద్యార్థులు ఉండగా 5,823 మంది విద్యార్థులు అర్హత జాబితాలో ఉండగా, 741 అనర్హుల జాబితాలో ఉన్నారు. గతంలో ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తప్పులు తడకగా వివరాలు నమోదు చేయడంతో రెండు, మూడు ఎకరాలు కూడా లేని వారికి 12 ఎకరాలు ఉన్నట్లు జాబితాలో కనబరిచారు. గుడిపల్లి గ్రామానికి చెందిన తలారి అనంతమ్మకు రెండెకరాల భూమి ఉంది. అయితే జాబితాలో 10 ఎకరాలు ఉన్నట్లు పేర్కొనడంతో ఆమె కుమారునికి తల్లికి వందనం వర్తించలేదు. జూలుకుంట గ్రామానికి చెందిన నరసింహకు వాస్తవానికి 99 సెంట్లు మాత్రమే ఉందని కానీ జాబితాలో 12 ఎకరాల్లో భూమి నమోదు చేయడంతో వారి ఇద్దరు కుమారులను అనర్హుల జాబితాలో చేర్చారు. ఇలా మండల వ్యాప్తంగా పలువురు అర్హులను 'తల్లికి వందనం' జాబితాలో అనర్హులుగా చూపడంతో ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను తహశీల్దార్ కార్యాలయం దగ్గర పడిగాపులు కాస్తున్నారు.

తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన సాక్షి పత్రికతో పాటు ఆ ఛానల్ ఎండి వైఎస్ భారతిరెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని టిడిపి మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో వారు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, ప్రధాన కార్యదర్శి పాల్యం రామసుబ్బమ్మ మాట్లాడుతూ వైసిపి హయాంలో రాజధాని, మహిళా రైతులను ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు. ఇప్పుడు మహిళలను కించపరిచేలా డిబేట్‌లు నిర్వహించడం దుర్మార్గమన్నారు. కావున సాక్షి యాజమాన్యం రాష్ట్ర మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హేమలతా బాయి, గంగరత్నమ్మ, లావణ్య, మాధవి, రమణమ్మ, సుశీల, సామకోటి ఆదినారాయణ, పోతలయ్య, రత్నప్ప చౌదరి, గంగాధర్ నాయుడు, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం : పల్లె

ఒడిసిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపి పార్థసారథి, పల్లె

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పల్లె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ భూములను ప్రభుత్వ భవనాల నిర్మాణానికి, ప్రజాపయోగకరమైన పనులకు మాత్రమే ఉపయోగిస్తామన్నారు. ఆకుతోటపల్లి వద్ద గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసినజగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలను రద్దుచేసి కొత్తగా 3 సెంట్ల చొప్పున అర్హులకు స్థలంతో పాటు ఇళు మంజూరు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో జీన్స్ పరిశ్రమ ఏర్పాటుకు భూమిని కేటాయిస్తామన్నారు. అర్హులైన పేదలు, పాత్రికేయులకు ఆకుతోటపల్లి వద్ద ఉన్న ఎన్టీఆర్ కాలనీలో ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం స్థానిక బిసి కాలనీలో గుండెపోటుతో మృతిచెందిన టిడిపి కార్యకర్త రహంతుల్లా(65), డయాలసిస్ జబ్బుతో బాధపడుతున్న రామాంజనేయులు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పల్లె వెంట తహశీల్దార్ ఆనందాచారి, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్‌రెడ్డి, తుమ్మల మహబూబ్ బాషా, అంజనప్ప, బోరు రమణ, పీట్ల సుధాకర్, ఎంపిటీసీ శ్రీనివాసులు, సర్పంచి శంకర్‌రెడ్డి, నర్సింహులు, శివారెడ్డి, నిజాం, వల్లపు సోమశేఖర్, శీను నాయక్, జౌళి బాబా, కంచి సురేష్, ఓబుల్‌రెడ్డి ఉన్నారు.

వడ్డెర కమ్యూనిటీ భవనానికి స్థల పరిశీలన

మండలంలో వడ్డెర సామాజిక వర్గానికి రూ. 80 లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఎంపీ బికె.పార్థసారథి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. వారు సోమవారం మండలంలోని సున్నంపల్లి పంచాయతీలోని సర్వేనెంబర్ 785/1లో ఉన్న 2.55 ఎకరాల భూమిలో ఎకరా విస్తీర్ణంలో వడ్డెర కమ్యూనిటీ భవనం నిర్మించడానికి స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎం.కొత్తపల్లి, ఓడి చెరువు పొలాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఆలోచనతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. అందులో భాగంగానే కమ్యూనిటీ భవనం మంజూరు చేసిందన్నారు. ఈ సామాజిక వర్గంలో చదువుకొనే విద్యార్థుల్లో అత్యంత ప్రతిభావంతులను గుర్తించి వారిని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అంగన్వాడీ, ఆశాలకు 'తల్లికి వందనం' అమలు చేయాలి

లేపాక్షి నంది విగ్రహం ప్రాంగణంలో సమావేశమైన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-లేపాక్షి

అంగన్వాడీ, ఆశా కార్మికులకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. లేపాక్షి నంది విగ్రహం ప్రాంగణంలో సోమవారం సిఐటియు, ప్రజా సంఘాల కార్మికులతో మండలం కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ముందుగా కన్వీనింగ్ కమిటీ నూతన కన్వీనర్‌గా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. కమిటీలో అంగన్వాడీ, ఆశా కార్మికులకు అవకాశం కల్పించారు. జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఏ సంక్షేమ పథకానికైనా, సర్వేలకైనా అంగన్వాడీ, ఆశాలను ఉపయోగించుకుంటారే తప్ప వారికి ఆ పథకాలను వర్తింపచేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగానూ గుర్తించడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వారికి ప్రభుత్వ పథకాల అమలు చేయాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, భాగ్యమ్మ, రత్నమ్మ, రూపమ్మ, నాగలక్ష్మి, ఆశా వర్కర్లు పద్మావతి, రాధమ్మ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్, పారిశుధ్యం, ఎన్ఎంఆర్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందనంతో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపచేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యంలో కదిరి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చాలీచాలనీ వేతనంతో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వం ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకొని సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జనార్ధన, బాలకృష్ణ, తిరుపాల్, నరసింహమూర్తి, చిన్నకృష్ణ, సూరి, రాజు, శ్రీనివాసులు, సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్‌అలీ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి ఏవోగా విజయభారతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యవసాయ శాఖ అధికారిణి(ఏవో)గా విజయభారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పరిగిలో పనిచేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఏవో మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ప్రభుత్వం త్వరలో రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కావాలంటే ప్రతి రైతు వారి రెవెన్యూ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

తలుపుల ఏవోగా నాగమధుసూదన్

తలుపుల : మండల వ్యవసాయ శాఖ అధికారిగా పి.నాగమధు సూదన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కదిరి భూసంరక్షణ కేంద్రంలో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఏవోను గాండ్ల పెంట మండలానికి బదిలీ చేశారు. నూతన ఏవో మాట్లాడుతూ రైతులకు ఎప్పు డూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందిన ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ వి.రత్న తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఎస్పీ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పాల్గొని ప్రజ నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. కార్యాక్రమంలో కుటుంబ కలహాలు, భూ సమస్యలు, సైబర్ మోసాలు, ఆస్తి పంపకాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం ధర్మవరంలో చోటుచేసుకుంది. హిందూపురం జిఆర్‌పి పోలీసులు వెంకటరామిరెడ్డి, ఎర్రిస్వామి మాట్లాడుతూ పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన గుండు గోపాల్(57) తాగుడుకు బానిసై తరచూ భార్య, కోడలిని వేధింపుకు గురి చేసేవాడు. కోడలు గర్భిణి కావడంతో ఆమె చికిత్స అత్త రూ. 10వేలు దాచిపెట్టింది. ఈ విషయం తెలుసుకున్న గోపాల్ ఆ రూ. 10వేలు ఇవ్వాలని గొడవ పెట్టుకోగా అత్తా, కోడలు ససేమిరా అన్నారు. దీంతో గోపాల్ క్షణికావేశంలో కాలనీ వెనుక వైపు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారం మేరకు హిందూపురం జిఆర్‌పి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కేశవ నగర్‌లో బివిఆర్ బిల్డింగ్ వద్ద సోమవారం మంజునాథ్(32) అనే కూలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మంజునాథ్ బిల్డింగ్ పరదాలు పగలుగొట్టే సమయంలో అందులో ఉండే ఇనుపకడ్డీ విద్యుత్ లైనుకు తగిలింది. దీంతో ఇనుప కడ్డీ ద్వారా విద్యుత్ ప్రవహించి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మంజునాథ్ పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన వ్యక్తిగా వన్ టౌన్ పోలీసులు గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడి భార్య డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లిందని, అతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎద్దుల బండిని ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఎద్దుల బండి, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పెడకంటివారిపల్లి తండా వద్ద జరిగింది. ఎస్ఐ వలిబాషా తెలిపిన వివరాలు.. మండలంలోని ముక్కవాండ్లపల్లి గ్రామానికి చెందిన హరి(36) భార్యతో కలిసి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రెక్కమానుకు వెళ్తుండగా పెడకంటివారిపల్లి తండా వద్ద ఎద్దులబండిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో హరి అక్కడికక్కడే మృతి చెందాడు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమార్కులపై కేసు నమోదు

కదిరి టౌన్ : లారీలను ఆపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. తమిళనాడుకు చెందిన కంటైనర్ డ్రైవర్ మారుదముత్తు అర్చామీ ఫిర్యాదు మేరకు వివరాలు.. తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు అనంతపురం సంతలో పశువులు కొనుగోలు చేసి రెండు కంటైనర్లలో తీసుకెళ్తుండగా కుటాగుళ్ల, పులివెందుల జంక్షన్ వద్ద కుటాగుళ్లకు చెందిన పొట్టిండ్ల నాగభూషణ, భుఖ్యా అంజనేయులు నాయక్‌తో పాటు పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన మందల కుళ్లాయప్ప పోలీసుల పేరుతో కంటైనర్ల డ్రైవర్లను బెదిరించి రూ. 20 వేలు డిమాండ్ చేయగా చివరకు వారు రూ. 6 వేలు ఇచ్చారు. ఆ తర్వాత బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

చిలమత్తూరు : బెంగళూరుకు చెందిన బాలరాజు, లక్ష్మీ దంపతులు సోమవారం మండలంలోని వీరాపురం పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీపురం, వెంకటాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్, రెయిన్ కోట్లు, దుస్తులు అందజేశారు. ఆ దంపతులు విద్య ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వీరు ఆలయాలు, పేదలకు అవసరమైన వస్తువులు పంపిణీ చేస్తుంటారు. ఆ దంపతులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం జనార్ధన్, పురుషోత్తంరెడ్డి, న్యాయవాది గంగరాజు, గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి నాగేంద్ర, సోము, నాగరాజు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్ : పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద ఉన్న ఆదర్శ(మోడల్ స్కూల్)పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పద్మశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఫస్ట్ ఇంటర్, 8, 9 తరగతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తామని తెలిపారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

గాండ్లపెంట : ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం మండలంలోని కటారుపల్లి పంచాయతీలోని కె.గొల్లపల్లి దళితవాడ మహిళలు స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ బి.బాబురావుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ మా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు విద్య, వైద్యం, పక్కా గృహాలు, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తూ అండగా ఉందన్నారు. అలాంటి సంస్థలకు విదేశీ నిధులు రాకుండా ఆటంకం కలిగించడం దుర్మార్గమన్నారు. స్పందించిన తహశీల్దార్ ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు గౌరమ్మ, గంగులమ్మ, లక్ష్మీదేవి, ముత్తమ్మ, భవాని, గంగోజమ్మతో పాటు సుమారు 70 మంది పాల్గొన్నారు.

తహశీల్దార్ బి.బాబురావుకు వినతి పత్రం ఇస్తున్న గొల్లపల్లి గ్రామస్తులు

ఇళ్ల పట్టాల అవకతవకలపై విచారణకు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని సున్నపుగుట్టతండాలో సర్వే నెంబర్-470లో ఇంటి నివేశన స్థల పట్టాల మంజూరులో జరిగిన అవకతవకలపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఆర్డీవో వివిఎస్ శర్మ అధ్యక్షతన ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి విచారణ జరిపించినట్లు తహశీల్దార్ సోమవారం తెలిపారు. ఆ టీం ఇచ్చిన నివేదిక ప్రకారం దాదాపు 70 పట్టాలు నకిలీవిగా గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పార్థసారధి కాలనీ, దేవానంద్ కాలనీ, బండారు లక్ష్మణ్ కాలనీ, యర్రగుంటపల్లి జగనన్న కాలనీ, టిడ్కో వెనుకవైపు కాలనీల్లో విచారణ కోసం బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం

కదిరి టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా బహావుద్దీన్ ఆ ప్రాంతంలో పర్యటించి బిలాల్ మసీద్ వద్ద పాడైన బోరుకు మరమ్మతులు చేయించడంతో పాటు కొత్త పంపును అమర్చాలని మున్సిపల్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. దీంతో వారు సమస్యను పరిష్కరించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇర్ఫాన్, ఫరూక్, బాబ్‌జాన్, నూర్, జాఫర్‌వలి, బేల్దారి ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి క్రికెట్ కిట్ అందజేత

ధర్మవరం రూరల్ : పట్టణంలోని జీవన జ్యోతి పాఠశాలలో చదువుతున్న వెంకటరమణ కూతురు రేఖారాణి క్రికెట్‌లో రాణిస్తోంది. విద్యార్థిని ప్రతిభను గుర్తించిన పారిశ్రామిక వేత్త సందా రాఘవ సోమవారం విద్యార్థినికి క్రికెట్ కిట్‌ను బహూకరించారు. సందా రాఘవ, సందా రవి మాట్లాడుతూ క్రికెట్‌లో మంచి నైపుణ్యం ప్రదర్శించి ధర్మవరం పట్టణానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు.

'పోస్టల్' పథకాలపై అవగాహన

తాడిమర్రి : పోస్టల్ డిపార్ట్‌మెంట్ గ్రామీణ ప్రజలకు అందించే పలు పథకాలపై సోమవారం తాడిమర్రిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పోస్టల్ సిబ్బంది, పోస్ట్ మాస్టర్ నూర్ మహమ్మద్, ఎంవో బుడ్డన్న తదితరులు మెయిన్ బజార్‌లో ర్యాలీ నిర్వహించారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగులకు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఇతర పథకాల గురించి వివరించారు.

నాటుసారా, మద్యం అమ్మకాలను అరికట్టాలి

గుడిబండ : మండలంలోని జిఎస్.తండాలో నాటుసారా, మద్యం అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం తండాకు చెందిన పలువురు మహిళా సంఘాల సభ్యులు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామంలో మద్యం ప్రియులు తాగిన మైకంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే గాక ఘర్షణలకు పాల్పడుతున్నారన్నారు. యువకులు మద్యానికి బానిసలై జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని వాపోయారు. వీరికి వెలుగు ఎపిఎం తిప్పన్న, సిసి శ్రీధర్, యానిమేటర్ గంగభూషణ మద్దతు పలికారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో మహిళా సంఘాల సభ్యులు సుశీలమ్మ, అమల, భారతి, భీమభాయ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

'బెల్లా' పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పరిగి

స్థానిక బెల్లా పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమ వారం స్థానికులు ఎంఇఒ లక్ష్మీదేవికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ బెల్లా పాఠశాలలో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడమే కాకుండా అధిక ధరలకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫారం విక్రయిస్తున్నారన్నారు. వాటిని పాఠశాలలోనే కొనుగోలు చేయాలని నిబంధన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి చదివిన వారిని నియమించుకుని బోధన చేయిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని వాపోయారు. కావున ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని పాఠశాలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

పాలిసెట్ కౌన్సిలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సిలింగ్ అవగాహన సదస్సు విజయవంతమైందని ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. ముందుగా ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ప్రక్రియను వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో శాఖా అధిపతులు హేమాంజ, హరిబాబు, బాల జోషి, ప్రొఫెసర్లు రాజేష్, మల్లికార్జున, వంద మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.